APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

మంగళవారం 02-09- 2025

సంపుటి : 16 | సంచిక : 272 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 4 | వెల : రూ. 4

epaper.expresstelugudaily.com

## బిసి బిల్లుకు మండలి ఆమోదం

### బిఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య ముగిసిన మండలి

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ శాసనమండలలో సోమవార బీఆర్ఎస్ సభ్యుల గందరగోళం నడుమ నాలుగు బిల్లులను మండలి ఆమోదించింది. ఆ తరవాత నిరవధికంగా వాయిదా పడింది. మొదటగా బీసీ బిల్లుపై చర్చించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్టసవరణ, పురపాలక సంఘాల చట్టసవరణ, అల్లోపతిక్ ప్రైవేటు- వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్యనే మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం పొందాయి. అసెంబ్లీలోకాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. చైర్మన్ పోడియం దగ్గర బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో శాసనమండలిలో కొంత గందరగోళ వాతావరణం నెలకొంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక పేపర్లు చింపి మండలి చైర్మన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సీబీఐ వద్దు.. రేవంత్‌కు సీబీఐ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం వద్ద నిరసన వ్యక్తం చేయొద్దని.. వారికి కేటాయించిన స్థానాల్లోనే నిరసన వ్యక్తం చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు.



## మరో అల్పపీడనం ఏర్పడే

# అవకాశం

### ఎగువన వర్షాలతో భారీగా వరదలు

### అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

### అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సిఎం రేంవత్ రెడ్డి మరోమారు అధికారులను అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్ ఉందన్న నేపథ్యంలో అప్రమత్తం చేశారు. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాలు, వరదల నష్టంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. వర్షాల కారణంగా 1,052 చోట్ల 1,023 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని వారిని ఆదేశించారు. అలాగే గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు రాక పోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ అంశాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. మిగతా 2లో..

## మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

- మహిళా సంఘాలకే చేప పిల్లల పెంపకం బాధ్యతలు
- మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ
- కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్ లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల వారు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పరిస్థితిని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువులు చేప పిల్లల పెంపకానికి 122 కోట్లు- విడుదల చేశామని డిప్యూటీ- సీఎం తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామని ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. మిగతా 2లో..



## బతుకమ్మకు అంతర్జాతీయ గుర్తింపు

### పోస్టర్ విడుదల చేసిన మంత్రులు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బతుకమ్మ పండుగను అంతర్జాతీయస్థాలిలో గుర్తింపు దక్కేలా, గిన్నిస్ రికార్డు చోటుచేసుకునేలా గొప్ప కార్నివాల్‌గా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బతుకమ్మకు జాతీయస్థాయి ప్రచారం కోసం కొన్ని విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం అని మంత్రి జూపల్లి తెలిపారు. ఈనెల 21 నుంచి 30 వరకు మిగతా 2లో..

## బిసి బిల్లుకు ఆమోదం
# తెలపండి

### గవర్నర్‌ను కోరిన అఖిలపక్షం నేతలు

### బిసిబిల్లు అసెంబ్లీ ఆమోదంపై గవర్నర్‌కు వివరణ



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు, ఎమ్మెల్యేలు సోమవారం రాజ్ భవన్‌లో కలిశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదం కోసం వినతి పత్రం ఇచ్చారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లుపై త్వరగా మిగతా 2లో..

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బిఆర్ఎస్‌దే
# బాధ్యత

### సిబిఐ విచారణకు బిజెపి ముందునుంచే డిమాండ్

### ఆలస్యంగా అయినా స్పందించిన ప్రభుత్వం

### కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

### 22 నెలల పాటు నిర్లక్ష్యం చేశారన్న లక్ష్మణ్



2లో

## భారత్, రష్యాలది బలమైన స్నేహం

### పరస్పర అవగాహనతో ముందుకు సాగుతున్నాం.. షాంఘై వేదిక నుంచి ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎప్పుడు కష్టకాలం ఎదురైనా భారత్,రష్యాలు పరస్పర స్నేహంతో ముందుకు సాగాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తమబంధం ఇరుదేశాల ప్రజలకే కాకుండా.. ప్రపంచ శాంతి, స్థిరత్వం, సుసంపన్నతకు చాలా అవసరమన్నారు. ఇరుదేశాల మధ్య తరచూ జరుగుతున్న ఉన్నతస్థాయి భేటీలు తమ మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని తెలియజేస్తున్నాయన్నారు. భారత్-రష్యా సంబంధాలు కొన్ని సూత్రాల ఆధారంగా బలంగా ఉన్నాయని అభివర్ణించారు. బహుముఖ సహకారంతో తాము ముందుకువెళుతున్నట్లు- పేర్కొన్నారు. తమ బంధం రాజకీయాలకు అతీతంగా చాలా విశ్వాసపూర్వక మైందని ప్రధాని అభివర్ణించారు. భారత్-రష్యా ద్వైపాక్షిక సదస్సు తింజాయన్‌లోని రిట్జ్ కార్లటోన్ హోటల్‌లో మొదలైంది. ఇక రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియాలని మానవాళి కోరుకుంటోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇరుపక్షాలు ఈ దిశగా అడుగులు వేస్తాయని ఆశిస్తున్నట్లు- చెప్పారు. ఇటీవల జరిగిన శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. డిసెంబర్‌లో జరగనున్న భారత్-రష్యా సదస్సుకు పుతిన్ రాక కోసం 140 కోట్ల మంది భారతీయులు ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా ప్రధాని మోదీ చెప్పారు. ఇక ఈ భేటీలో పుతిన్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీని ఆప్తమిత్రుడిగా అభివర్ణించారు. భారత పీఎంతో భేటీ- కావడంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు. షాంఘై సహకార సదస్సు గ్లోబెల్ సౌత్, ఈస్ట్ దేశాలకు ఓ బలమైన వేదిక అని అభివర్ణించారు. రానున్న కాలంలో జరగనున్న భారత్-రష్యా ద్వైపాక్షిక సదస్సు తమ బహుముఖ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.



## విజినరీ లీడర్ చంద్రబాబు నాయుడు

### పరిపాలనా దక్షత ఆయనకున్న ప్రత్యేకత

### చంద్రబాబు 30 ఏళ్ల సిఎం ప్రస్థానంపై పవన్ అభినందనలు

**అమరావతి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పాలనాదక్షత, ముందుచూపు చంద్రబాబు ప్రత్యేకతలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.ఆయనకు విజన్ ఉందని, అందుకు అనుగుణంగా పనిచేస్తారని అన్నారు. భవిష్యత్తును ఊహించి ప్రణాళికాబద్ధంగా దూరదృష్టితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దార్శనికుడు ఏపీ సీఎం చంద్రబాబు అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రిగా మిగతా 2లో..

## కెసిఆర్ వెనక గోతులు తవ్వేది ఆ ఇద్దరే

### హరీష్ రావు, సంతోష్‌లపై కవిత సంచలన వ్యాఖ్యలు

### కాళేశ్వరం కుట్రల వెనక ప్రధాన సూత్రధాని హరీష్ రావు

### కెసిఆర్‌ను అడ్డంపెట్టుకుని ఆ ఇద్దరు భారీగా ఆస్తులు కూడబెట్టారు

### ఇద్దరి వెనక సిఎం రేవంత్ హస్తం ఉంది

### ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



2లో

## స్థానికత అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

### 9నుంచి 12 తరగతులు చదివితేనే లోకల్‌గా పరిగణింపు

### సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరింపు



**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** స్థానికత అంశంపై సుప్రీంకోర్ట్ సంచలన తీర్పునిచ్చింది. తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే అంశంపై మిగతా 2లో..

## వారు కోరినట్లే సిబిఐ విచారణ

### నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత బిజెపిదే

### పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



2లో

# కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బిఆర్ఎస్‌దే బాధ్యత



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బిఆర్ఎస్ బాధ్యత వహించాలని బిజెపినేత కేంద్రమంత్రి బండిసంజయ్ తెలిపారు. కాళేశ్వరంపై బిజెపి వైఖరే నిజమని మరోసారి రుజువైందని అన్నారు. బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిపై బిజెపి సిబిఐ విచారణను కోరిందని, కాంగ్రెస్ మాత్రం బిఆర్ఎస్ ను కాపాడుతూ ఆలస్యం చేసిందని విమర్శించారు. నిజానికి తలవంచి సిబిఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు అప్పగింతకు అంగికరించారని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే సిబిఐకి లేఖ ఇవ్వాలని బండి సూచించారు. గతంలో ఒఆర్ఆర్ టోల్ - టెండర్లపై కాంగ్రెస్ సిట్ ను ప్రకటించిందని, అది నేటికి ఆచరణ రూపంలోకి రాలేదని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం డైలీ సీరియల్ లా కొనసాగుతోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ వైఖరే నిజమని మరోసారి రుజువైందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. కాళేశ్వరం అవినీతికి బీఆర్ఎస్ పూర్తి బాధ్యత వహించాలని కోరారు. కాళేశ్వరం అవినీతికి ముమ్మాటికీ బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై బీజేపీ సీబీఐ విచారణను తొలిసారిగా కోరిందని గుర్తుచేశారు బండి సంజయ్ కుమార్. కాంగ్రెస్ మాత్రం బీఆర్ఎస్‌ను కాపాడుతూ ఆలస్యం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే సీబీఐకి లేఖ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 22 నెలలు రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం చేసిందని.. తీరా ఇప్పుడు సీబీఐకి ఇచ్చారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కాళేశ్వరం కేసు సీబీఐకి ఇవ్వాలని మొదటి నుంచి బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి ఆధారాలతో సీబీఐకి సహకరించాలని సూచించారు. తెలంగాణ ప్రజల ధనాన్ని బీఆర్ఎస్ నేతలు మెక్కినదంతా కక్కించాలని హెచ్చరించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం అవినీతిలో లేరనే విషయాన్ని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై గౌరవం లేకుండా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడతారని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్‌పై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. కేసీఆర్‌తో రేవంత్ కుమ్మక్కు వలనే సీబీఐ విచారణను ఆలస్యం చేశారని ఆరోపించారు. విధిలేని పరిస్థితుల్లోనే రేవంత్ రెడ్డి.. కాళేశ్వరాన్ని సీబీఐకు అప్పగించారని చెప్పుకొచ్చారు. 22నెలలు ఎందుకు ఆలస్యం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలిని నిలదీశారు. సీబీఐ విచారణపై మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించటం లేదు? అని ప్రశ్నించారు. గుమ్మడికాయల దొంగ అంటే.. కేటీ-ఆర్ భుజాలు తడుముకుంటు-న్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అహం తగ్గలేదని.. ప్రజలు ఓడించినా బుద్ధి రావటం లేదని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై అన్ని ఆధారాలున్నాయని పీసీసీ హోదాలో రేవంత్ అన్నారని గుర్తుచేశారు. అన్ని ఆధారాలను రేవంత్ రెడ్డి సీబీఐకు ఇవ్వాలని సూచించారు. తెలంగాణ సంపను దోచుకున్న వారిని ఖచ్చితంగా శిక్షించాలని హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మాట్లాడే అర్హత కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు.

## మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం

(మొదటిపేజీ తరువాయి)

ఇక భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక సైతం అందజేయాలని సూచించారు. గత ఏడాది ఏర్పాటు- చేసిన ఎస్డీఆర్ఎఫ్.. వరదల సమయంలో బాగా పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఉన్నతాధి కారులకు సీఎం వివరించారు. హెచ్ఎండీఏ పరిదిలో చెరువులను వెంటనే నోటిఫై జరగాలని ఆదేశించారు. అయితే వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని అధికారులకు సూచించారు. అలాగే చనిపోయిన జంతువులకు సైతం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టం చేశారు. కింద స్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండి.. పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి అందజేయాల్సి ఉందని అధికారులకు తెలిపారు.

## మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారి తో సోలార్ పవర్ ఏర్పాటు- చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో మహిళల చేత పెద్ద ఎత్తున వ్యాపారం చేయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీ-శ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించి మొదటి సంవత్సరంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 21,600 కోట్లు- వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్టు- తెలిపారు. హై-టె-క్ సిటీ- పక్కన శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లో ఏర్పాటు- ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రపంచంతో పోటీ- పడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారు ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు- తెలిపారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుంది అన్నారు. ?కార్యక్రమంలో క్రీడలు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు- సాయికుమార్, ఊ-ూ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## విజినరీ లీడర్ చంద్రబాబు నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

తొలిసారి ప్రమాణం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పాలనాదక్షతతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, సంస్కరణలు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిని పరుగులు పెట్టించాయని ప్రశంసించారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో చంద్రబాబు ముద్ర చిరస్మరణీయ మన్నారు. పాలనలో ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా వాటిని సవాళ్లుగా స్వీకరించి ముందడుగు వేశారన్నారు. హైదరాబాద్‌ను ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన ఘనత చంద్రబాబుదే. ఆయన ఐటీ-కి పెద్దపీట వేయడంతోనే తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల నుంచి ఐటీ- ఉద్యోగులు వచ్చారు. రైతు బజార్ల ఏర్పాటు-, డ్వాక్రా సంఘాల స్థాపన, పేదలకు వెలుగు ప్రాజెక్ట్, మీసేవా కేంద్రాలు ఏర్పాటు-వంటి నూతన ఆవిష్కరణలు ఆయన ముందుచూపును తెలియచేస్తాయి. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టి.. రాజధాని లేని రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా సాగారు. 2024లోనూ మరింత క్లిష్ట పరిస్థితుల్లో పాలన పగ్గాలు తీసుకున్నారు. కఠిన సవాళ్లు ముందున్నా దృఢ చిత్తంతో పాలన వ్యవస్థను ముందుకు తీసుకువెళ్తున్నారు. రాష్ట్రానికి సీఎంగా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టులకు నిధులు సాధించడం చంద్రబాబు నాయకత్వ లక్షణాలు తెలియచేస్తాయి. పాలన వ్యవహారాల్లో సాంకేతికతను వినియోగిస్తూ, ప్రజలకు సత్వర సేవలు అందేలా చేస్తున్నారు. దార్శనికత కలిగిన చంద్రబాబు నిర్దేశకత్వంలో మేం ఏపీ అభివృద్ధికి నిబద్ధతతో పని చేస్తున్నామని పవన్ తెలిపారు.

## సిబిఐ విచారణకు భయపడేది లేదు

- రాహుల్ వద్దన్న సిబిఐ రేవంత్‌కు ముద్దు
- ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు
- గోదావరి జలాలపై బాబుతో కలసి కుట్ర
- మీడియా తో రేవంత్‌పై మండిపాటు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికను ఆదివారం ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వ, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈ కేసును సిబిఐకి అప్పగిస్తామని అన్నారు. అయితే ఈ విషయంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ మండిపడ్డారు . 'ఎక్స్' వేదికగా ఆయన సిఎం రవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సెటర్లు వేశారు. తెలంగాణలో కరెన్సీ మేనేజర్(సిఎం) కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తారట.గతంలో రాహుల్ గాంధీ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలను అంతం చేసే సెల్స్ అని అన్నారు. మిస్టర్ గాంధీ మీకు తెలుసా.. మీ సిఎం ఏం చేస్తున్నారో..? ఇలా ఎంత బెదిరించినా.. భయపడేది లేదని.. రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజలపై, న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉందని కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.దీంతో పాటు గతంలో రాహుల్ చేసిన పోస్ట్‌కి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఆయన జత చేశారు. ఇదిలావుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ సాకుతో చంద్రబాబు, మోదీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి భారీ కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేవలం కేసీఆర్, బీఆర్ఎస్ మీదనే దాడి జరగడం లేదన్న కేటీఆర్.. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి మన గోదావరి జలాలను ఆంధ్రకు తరలించే కుతంత్రాలకు ఆ ముగ్గురు తెరతీశారని మీడియా వద్ద విమర్శించారు. తెలంగాణ గొంతుకగా ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్‌లను లేకుండా చేసి తెలంగాణపై తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టు-కునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీ-ఆర్ మండిపడ్డారు. మోదీ, చంద్రబాబు ఎజెండా మేరకు బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని, ఇక్కడి రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించడం అంటే ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టడమేనని అన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ-సంస్థలను మోదీ జేబు సంస్థలుగా విమర్శించిన రేవంత్.. 48 గంటల్లోనే ఎందుకు మాట మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అంతా కేంద్ర దర్యాప్తు సంస్థలను అధికార బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం మోదీ ప్రాపకం కోసం వాటిని ఉపయోగించుకుంటు-న్నారని విమర్శించారు. రాహుల్ గాంధీకి చేదుగా అనిపించిన సీబీఐ, రేవంత్‌కు మాత్రం ముద్దొస్తుందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కోరగానే సీబీఐకి అప్పజెప్పడం ఆ రెండు పార్టీల అక్రమ బంధానికి సాక్ష్యం అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, బంగారు తెలంగాణ నిర్మాతగా చరిత్ర సృష్టించిన కేసీఆర్ మీద విష ప్రచారం చేయాలన్న దుర్మార్గ, రాక్షస ఆలోచనతో రేవంత్ ఉన్నాడని కేటీ-ఆర్ విరుచుకుపడ్డారు. గతంలో ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలినా, సుంకిశాలలో సైడ్ వాల్ కూలినా, వట్టెం పంప్ హౌజ్ కూలిపోయినా, పెద్దవాగు రెండుసార్లు కొట్టుకుపోయినా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదని కేటీ-ఆర్ గుర్తుచేశారు. అప్పుడు రాని జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ-మేడిగడ్డ రెండు పిల్లర్లు కుంగితే మాత్రం ఆగమేఘాల మీద వచ్చి తలాతోకలేని రిపోర్ట్ ఇచ్చిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మీద ఈగ కూడా వాలకుండా ప్రధాని మోదీ కాపాడుతున్న సంగతిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. పద్నాలుగేళ్ల ఉద్యమంలో, పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో, రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తెలంగాణ ఏకైక గొంతుకగా నిలుస్తున్న కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని అణచివేసే కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందన్నారు. సీబీఐకే కాదు, ఏ ఏజెన్సీకి కాళేశ్వరం విచారణ అప్పచెప్పినా బీఆర్ఎస్ పార్టీ భయపడదని చెప్పారు. బీజేపీతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న ఈ కుట్రలను ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. న్యాయస్థానాలపైన తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్న కేటీఆర్.. అక్కడ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## బిసి బిల్లుకు ఆమోదం తెలపండి

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకోవాలని కోరారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మహేష్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, సీపీఐ నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిశారు. గర్నవర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీకి బీజేపీ నేతలు ఎవరూ హాజరుకాలేదు.అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఫ్యూడలిస్ట్ పార్టీ అని విమర్శించారు. బీసీల అంశం చర్చకు వస్తే ఇలా అడ్డుపడటం సరికాదని చెప్పుకొచ్చారు. సమాజం గమనిస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కి బీసీల పట్ల ఉన్న గౌరవం, వైఖరి స్పష్టం అవుతోందని చెప్పుకొచ్చారు. 42శాతం రిజర్వేషన్లను అడ్డుకోవద్దని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. కులగణన సర్వేలో కూడా బీఆర్ఎస్ నేతలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లకు బీఆర్ఎస్ మద్దతు తెలపాలని కోరారు. బీసీ బిల్లు అడ్డుకోవడం ఏం పద్ధతని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి బీసీ రిజర్వేషన్‌లు ఇష్టం లేకపోవచ్చని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకునే కుట్ర దౌర్భాగ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై ఏకగ్రీవ తీర్మానం చేయడం మంచి పరిణామమని సీపీఐ నేత నారాయణ అన్నారు. మరోవైపు సభలో కాళేశ్వరంపై చర్చ జరుగుతుంటే పదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ అసెంబ్లీకి గైర్హాజరు కావడంపై ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే కేసీఆర్ తన అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## బతుకమ్మకు అంతర్జాతీయ గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 21న వేయిస్తంభాల గుడిలో బతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. గిన్నిస్ బుక్ రికార్డ్స్ సాధించే లక్ష్యంతో ఈనెల 29న ఎల్బీస్టేడియంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తాం అన్నారు పీపుల్స్ ప్లాజాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తాం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో విద్యార్థులంతా పాల్గొనేలా వేడుకలుంటాయి. బతుకమ్మ వేడుకల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రచారం కల్పిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ పండుగ గురించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి దేశవిదేశాలకు తెలిసేలా చేస్తామన్నారు. పర్యాటకశాఖ, మహిళలను భాగస్వామ్యం చేస్తూ వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. ఈసందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే పండగ నిర్వహణకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

## వారు కోరినట్లే సిబిఐ విచారణ

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు దీన్ని నమ్మినందుకే భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని గద్దెదించారని చెప్పారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే విచారణను సీబీఐకి అప్పగించాం. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కేసీఆర్ మొహం చాటేశారు. బీసీ బిల్లు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడుతోంది. భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. మండలిలో బీసీ బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు నానా హంగామా చేశారు. భాజపా తరహాలోనే ఆ పార్టీ కూడా బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ కెసిఆర్ కుటు-ంబ అవినీతిని బయట పెట్టిందని అన్నారు. బిజెపి డిమాండ్ చేసినట్టే కాళేశ్వరంపై విచారణ సిబిఐకి అప్పగించామని, కాళేశ్వరంపై సిబిఐ విచారణ పూర్తి చేసి బిజెపి నిబద్ధత చాటుకోవాలని సూచించారు. 42 శాతం బిసి రిజర్వేషన్లను బిఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిన మాట వాస్తవం కాదా? అని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ అవినీతిని ప్రజలు నమ్మారు కాబట్టే వారిని గద్దె దించారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కెసిఆర్ వెనక గోతులు తవ్వేది ఆ ఇద్దరే

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. కెసిఆర్‌ను బద్నాం చేసే పనిలో హరీష్ రావు, సంతోష్‌ల పాత్ర ఉందని, వారి వెనక సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలం ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా అని సూటిగా ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు- రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్డ్‌గా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించారని అన్నారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండని సవాల్ చేశారు. ఆ ఇద్దరు, ముగ్గురు నేతలే కేసీఆర్‌పై కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీష్‌రావు, సంతోష్‌ది కీలకపాత్ర అని వెల్లడించారు. వీరిద్దరి వెనక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని.. వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. నేనిప్పుడు మాట్లాడితే నా వెనుక ఎవరో ఉన్నారంటారని.. కానీ, అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బాధ్యుణ్ణి చేస్తూ రేవంత్ ప్రభుత్వం మా నాన్నపై సీబీఐ విచారణ వేసింది. నా కడుపు మండిపోతోంది. మా నాన్నకు డబ్బు, తిండిపై ఏనాడూ యావ లేదు. మా నాన్న పరువు పోతే మాకు బాధ.. వాళ్లకు ఏం లేదు. కాళేశ్వరం అవినీతిలో హరీష్‌రావుది మేజర్ పాత్ర. అందుకే హరీష్‌రావును ఇరిగేషన్ మంత్రిగా తొలగించారు. హరీష్‌రావు, సంతోష్‌రావు వల్లే కేసీఆర్‌కు ఈ పరిస్థితి దాపురించింది. కేసీఆర్‌ను అడ్డుపెట్టుకుని హరీష్, సంతోష్ భారీగా ఆస్తులు కూడబెట్టారు. హరీష్‌రావు, సంతోష్‌రావుకు డబ్బు మాత్రమే కావాలి. అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత కంటతడి పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లపైనా బిల్ పెడతారు. కానీ, ఎందుకు సుప్రీం కోర్టు దాకా వెళ్లి పోరాడటం లేదు. బిహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ బలి చేస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి బిహార్ వెళ్లి మీ బండారం బయటపెడతాం. సీబీఐ కాదు, ఇంకే విచారణ వేసినా కేసీఆర్ కడిగిన ముత్యంలా వస్తారని ధీమా వ్యక్తం చేశారు.



## స్థానికత అంశంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థించింది. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవాల్సిందేనన్న నిబంధనను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. తెలంగాణలో వరుసగా 9 ,10, 11,12 తరగతులు చదివితేనే లోకల్ అంటూ స్పష్టం చేసింది. అయితే ఈ రూల్స్ లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఉంటు-ందనే షరతు పెట్టింది సుప్రీం కోర్ట్. లోకల్ రిజర్వేషన్ అంశంపై తెలంగాణకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. వరుసగా నాలుగేళ్లు అంటే 9వ, 10వ, 11వ, 12వ తరగతులు తెలంగాణలో చదివితేనే స్థానికుడిగా పరిగణించాలని స్పష్టంచేసింది. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. స్థానికత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 33కి అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి మద్దతు తెలిపింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో వివాదాస్పదంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 33 ప్రకారం ఇంటర్మీడియట్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు చదివిన విద్యార్థులనే స్థానికులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. కానీ, కొందరు విద్యార్థులు దీన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ప్రతి రాష్ట్రం తన స్థానిక రిజర్వేషన్ల కోసం తగిన నిబంధనలు రూపొందించుకునే అధికారం ఉందని సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్రం వాదనలు వినిపించింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత తమ పిల్లలు మరో రాష్ట్రంలో చదవాల్సి వచ్చిందని అభ్యర్థుల తరపున వాదనలు వినిపించారు పిటిషనర్లు. అయితే ఇప్పటికే రాష్ట్రంలో లోకల్ కోటా పై జీవో 33 ను అమలు చేస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు విన్నవించింది. అయితే ప్రభుత్వ ఉద్యోగులు తప్పని పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్నారని..దాంతో వాళ్ళ పిల్లలకు జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. రాష్ట్రప్రభుత్వం చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే గతేడాది హైకోర్ట్ ఇచ్చిన తాత్కాలిక మినహాయింపుతో స్థానిక కోటా కింద ప్రయోజనం పొందిన విద్యార్థులు తమ ప్రయోజనాలను కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఎంబీబీఎస్, బీడీఎస్ యూజీ కోర్సులలో జీవో 33 ప్రకారమే స్థానిక కోటా రిజర్వేషన్లు అమలుకానున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే జీవో 33 నుంచి మినహాయింపు ఇస్తామనడంపై ప్రైవేటు-ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము కూడా తప్పని పరిస్థితుల్లోనే రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుందని తమ పిల్లల భవిష్యత్ గురించి ప్రభుత్వము కోర్టులు ఆలోచించాలని వేడుకుంటున్నారు.

## అసెంబ్లీలో బీసీలకు 42% శాతం రిజర్వేషన్ల ఆమోదం బీసీల విజయం తెల్ల హరికృష్ణ



కుత్బుల్లాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్: దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా బీసీలకు 42% శాతం రిజర్వేషన్ కల్పించినా రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర నాయకులు జర్నలిస్టు హరికృష్ణ మాట్లాడుతూ..దేశ చరిత్రలో తొలిసారిగా పార్టీలకు అతీతంగా 42% శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు ఆర్డినెన్స్ శాసనసభలో తీర్మానం చేసి గవర్నర్ కు పంపినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాము. అలాగే కేంద్రంలో బిల్లు ఆమోదించే వరకు ఏ పార్టీలు కూడా రాజకీయాలు చేయొద్దని బీసీలకు మద్దతుగా అన్ని పార్టీలు నిలవాలన్నారు. 42% బీసీ బిల్లుకు ఆమోదం తెలిపినటువంటి టిఆర్ఎస్ పార్టీకి, బిజెపి పార్టీకి, సిపిఐ పార్టీకి, ఎంఐఎం పార్టీ అందరికీ బీసీల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ అన్నారు.

## 6వ సారి గణేష్ లడ్డూను దక్కించుకొన్న హైదర్



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 5 రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డూను ఆదివారం వరుసగా 6వ సారి పెద్దేముల్ మండలం రేగొండి మాజీ సర్పంచ్ హైదర్ రూ.32 వేలకు దక్కించుకున్నారు.మండల పరిధిలోని రేగొండి గ్రామంలో వరుసగా 6వ సారి గణేష్ లడ్డూలను మాజీ సర్పంచ్ హైదర్ దక్కించుకొంటున్నారు.ఈ ఏడాది కూడా రేగొండి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రతిష్టించిన వినాయకుడి లడ్డూను వేలం పాటలో పాల్గొని రూ.32 వేల రూపాయలకు దక్కించుకొన్నారు.ఈ సందర్భంగా రేగొండి మాజీ సర్పంచ్ హైదర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు మతసామరస్యాన్ని కాపాడుకొంటూ,పర మత సహనాన్ని కలిగి ఉండి,అన్నదమ్ములవలె కలిసి మెలసి గ్రామంలో పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.6వ సారి వేలం పాటలో దక్కించుకొన్న గణేష్ లడ్డూను గ్రామంలో ఇంటింటికీ ప్రసాదంగా అందించడం జరుగుతుందని హైదర్ తెలిపారు. అనంతరం గ్రామంలో 6వ సారి గణేష్ లడ్డూను వేలం పాటలో అందుకున్న మాజీ సర్పంచ్ హైదర్ ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో రేగొండి గ్రామ పెద్దలు, యువకులు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల కుంట తండా వాడవాడల పూజలు అందుకున్న గణనాథుడు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని గొల్ల కుంట తండా గ్రామ గ్రామాన ప్రతి వాడ వాడల గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా కొనసాగుతున్నాయి. మాజీ సర్పంచ్ రాథోడ్ సోనీ శివరాం ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రులు పూజలు పురస్కరించుకున్న..చిన్నపిల్లలు, యువకులు వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ప్రతినిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వినాయక విగ్రహాల వద్ద పూజలు నిర్వహిస్తూ తమ మొక్కలను చెల్లించుకుంటున్నారు.ఈ విగ్రహాల వద్ద నిత్యం అర్చకులు పూజలు నిర్వహిస్తూ తీర్థప్రసాదాలను అందజేస్తున్నారు.యువకులు,గ్రామ పెద్దలు, చిన్న పిల్లలు ఎంత ఉత్సవంతో భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహిస్తూ తమ భక్తుని చాటుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దలు రాథోడ్ తుకారం మహారాజ్, రాథోడ్ కృష్ణమూర్తి నాయక్, పవన్ కుమార్,రాథోడ్ వెంకటేష్, నేనావత్ వినోద్ కుమార్,బాలు,గణేష్ లాల్,మన్య నాయక్, తదితరులు గ్రామస్తులు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉత్సవ అన్నదాన ప్రసాదంలో పాల్గొన్న భక్తులు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుని వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయకుని వద్ద అర్చకులు కాశీనాథ్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం అల్లాదుర్గంలో సంత కావడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు హాజరై వినాయకుని పూజా కార్యక్రమంలో పాల్గొని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. అల్లాదుర్గం మండల వ్యవసాయ అధికారి రాజేష్, నవీన్ కుమార్,అల్లాదుర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై సదానందం, రైతు సంఘం అధ్యక్షులు రమేష్,వినాయక మండపాని సందర్శించి భక్తులతో కలిసి అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ అన్నదానం మహాదానం వినాయకుని ఆశీస్సులతో ఈ పుణ్య కార్యంలో భాగం కావడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి శాంతి, సుఖము,ఆరోగ్యం కలగాలని గణనాథుని ప్రార్థిస్తున్నామన్నారు.ఈ వినాయకుని పూజా కార్యక్రమంలో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు ,రైతు సంఘం నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# అన్నం పెట్టే రైతన్నకు తప్పని యూరియా ఇబ్బందులు

### యూరియా కోసం నానా ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

- ఉదయం 7 గంటల నుండి సొసైటీల ముందు బారులు తీరుతున్న రైతులు
- యూరియా కోసం వచ్చి క్యూ లైన్ లో నిలబడి సొమ్మసిల్లి పడిపోయిన జనగాం రైతు
- స్థానిక పీహెచ్సీకి ఆటోలో తరలించిన పోలీసులు, రైతులు
- పెద్దేముల్ సొసైటీ పరిధిలో గత సంవత్సరం 6,040 బస్తాలు,ఈ ఏడాది 5,074 బస్తాల సరఫరా
- ఇంకా 2,400 బస్తాల యూరియా పెద్దేముల్ సొసైటీకి రావాల్సింది ఉంది





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రైతులు యూరియాను దక్కించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆయా సొసైటీల్లో యూరియా లారీలు వచ్చాయని తెలిసాయంటే చాలు వెంటనే సొసైటీల ముందు బారులు తీరుతూ యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉండడంతో వ్యవసాయ సాగు కొరకు యూరియా తప్పని సరి కావడంతో రైతులు యూరియాను పొందడానికి పడరాని పాట్లు పడుతున్నారు.దేశానికి అన్నం పెట్టే రైతన్నకు యూరియా ఇబ్బందులు తప్పగ పోగా యూరియా కోసం ప్రతి రోజు ఓ యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.సొసైటీలలో యూరియా వచ్చిందని తెలిసిన వెంటనే యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూ లైన్ లలో నిలబడిన యూరియా దొరకడం ఇబ్బందిగా మారింది. రైతుల పంటల సాగుకు కావాల్సినంత యూరియా ఇవ్వకుండా 1,2 బస్తాలు ఇచ్చి అధికారులు కూడా చేతులు దులుపుకొంటున్నారు. యూరియా కోసం రైతులు క్యూ లైన్ లో నిలబడుతున్న సమయంలో తోపులాట జరగడంతో రైతులు నరకం అనుభవిస్తున్నారు. ఇదిలా ఉంటే సోమవారం మండల కేంద్రంలోని పెద్దేముల్ సొసైటీకి ఇటీవల సుమారు 200 వందల బస్తాల యూరియా వచ్చింది.ఈ యూరియా బస్తాలను తీసుకోవడానికి రైతులు ఉదయం 7 గంటల నుంచే పెద్దేముల్ సొసైటీ దగ్గర క్యూ లైన్ లో నిల్చొని పడిగాపులు కాశారు.అయితే అధికారులు మాత్రం ఆధార్ కార్డు ఆధారంగా ఒక్క రైతుకు ఒక్క బస్తా యూరియా మాత్రమే పంపిణీ చేశారు.ఈ క్రమంలో సోమవారం క్యూ లైన్ లో నిలుచున్న జనగాం గ్రామానికి చెందిన రైతు బిల్లిపురం మల్లప్ప క్యూలైన్ లో జరిగిన తోపులాటలో ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోయాడు.అక్కడే ఉన్న స్థానిక పోలీసులు, స్థానికులు హుటాహుటిన ఆయనను స్థానిక పీహెచ్సీకి ఆటోలో తరలించారు.ఈ సంఘటనతో ఆగ్రహానికి లోనైన రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతూ తమప్రాణాలపైకి తెచ్చుకొంటున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల పంటలకు సరిపడ యూరియా ఇవ్వకుండా అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు మండిపడ్డారు.ఈ విషయమై పెద్దేముల్ సొసైటీ మేనేజర్ మురళీ గౌడ్ ను వివరణ కోరగా పెద్దేముల్ సొసైటీకి గత సంవత్సరం సుమారు 6,040 బ్యాగుల యూరియా వచ్చిందని,ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు సుమారు 5,074 బస్తాల యూరియా వచ్చిందని అన్నారు.ఇంకా 2,400 బస్తాల వరకు యూరియా సొసైటీకి రావాల్సి ఉందని తెలిపారు.గతంలో యూరియా కొరత లేకపోవడంతో ఒక్కొక్క రైతుకు 3,4 బస్తాల వరకు యూరియాను పంపిణీ చేశామని, ప్రస్తుతం పై నుండే యూరియా కొరత ఉండడంతో వచ్చిన యూరియాను అందరు రైతులకు సరిపెట్టాలనే ఉద్దేశ్యంతో ఒక్క రైతుకు ఒక్క బస్తా యూరియాను మాత్రమే ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

## పగిలిన బట్టి కుంట చెరువు కట్టను పరిశీలించిన మెదక్ ఆర్డిఓ రామదేవి



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పగిలిన బట్టి కుంట చెరువు కట్టను మెదక్ ఆర్డీవో రమాదేవి సోమవారం సందర్శించి పరిశీలించారు. గత పది రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు అల్లాదుర్గంలోని బట్టి కుంట చెరువు కట్ట నీటితో నుండి పగిలిపోయింది దీంతో నీరంతా పంట పొలాల నుండి బీటీ రోడ్డు మీదుగా నీరు పారింది. దీంతో చెరువులోని నీరంతా వరి పొలాలపై నుండి పోవడంతో వరి నారు కొట్టుకపోయాయి. ఇంతే కాకుండా పొలాల్లో నల్ల మట్టి ఇసుక దిబ్బలు వేశాయి.ఈ వరద వల్ల అల్లాదుర్గం ,కాగితంపల్లి ,సీతానగర్ గ్రామాల వ్యవసాయ వరి పొలాల పై నుండి పెద్ద ఎత్తున వరద నీరు పారడంతో భారీ నష్టం జరిగినట్లు గ్రామాల రైతులు తమ బాధను వ్యక్తం చేశారు. ఈ బట్టి కుంట చెరువు కట్ట తగడంతో అల్లాదుర్గం నుండి ఇతర గ్రామాలకు పోవాలన్న అల్లాదుర్గం సమీపంలోని బీటీ రోడ్డుపై నుండి భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రోడ్ అంతా కొట్టుకపోయింది .దీంతో పోలీసులు ఈ రోడ్డు గుండా ఎలాంటి వాహనాలు పోకుండా పోలీస్ బ్యారికెట్లు ఏర్పాటు చేశారు. ఈ చెరువు కట్ట తెగిపోవడంతో విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డిఓ రమాదేవి, తాసిల్దార్ మల్లయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి రాజేష్ కుమార్ లు చెరువు కట్ట వద్దకు సందర్శించి చెరువు కట్ట పగిలిన చోట పరిశీలించారు. చెరువు కట్ట పెద్ద ఎత్తున తెగిపోవడంతో పరిస్థితిని చూసి ఈ చెరువు కట్ట కు మరమ్మత్తులు చేయడానికి ఎస్టిమేంట్ తయారుచేసి నివేదికను అందించాలని మెదక్ ఆర్డిఓ రమాదేవి ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. నివేదిక తొందరగా జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తే చెరువు కట్టకు మరమ్మత్తులు కోసం ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందని మెదక్ ఆర్డిఓ తెలిపారు. పగిలిన చెరువు కట్ట పెద్దగా ఉండడంతో దీని మరమ్మత్తులు ఏ విధంగా చేయాలో గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకుపోయారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బలరాం నాయకులు బేతయ్య,బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ భూతాన్ని తరిమికొట్టే వరకు నిద్రపోము

- మహాధర్నాకు భారీగా తరలివెళ్ళిన పెద్దేముల్ మండల ఉపాధ్యాయులు
- సీపీఎస్ అంతమే పీఆర్టీయూటీఎస్ ప్రధాన పంతం
- ఉద్యోగ,ఉపాధ్యాయులకు తక్షమే ఓపీఎస్(పాత పెన్షన్ విధానం)ను అమలు చేయాలి
- సీపీఎస్ భూతాన్ని రద్దు చేసే వరకు అలుపెరగని పోరాటం ఆగదు
- 2004లో ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు ఓపీఎస్ ను అమలు చేయాలి
- పీఆర్టీయూ పెద్దేముల్ మండల శాఖ అధ్యక్షుడు-పోల నవీన్ కుమార్



**పెద్దేముల్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** సీపీఎస్‌ను అంతం చేయడమే పీఆర్టీయూటీఎస్ ప్రధాన పంతమని పీఆర్టీయూ పెద్దేముల్ మండల శాఖ అధ్యక్షుడు పోల నవీన్ కుమార్ అన్నారు.సోమవారం పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తునా నిర్వహించిన మహాధర్నాకు పెద్దేముల్ మండల పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో, జిల్లా,రాష్ట్ర బాధ్యులతో, ఉపాధ్యాయులతో ప్రత్యేక వాహనంలో భారీగా తరలివెళ్లారు.ఈ సందర్భంగా పీఆర్టీయూ పెద్దేముల్ మండల అధ్యక్షుడు పోల నవీన్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట పెను భూతంగా మారిన సీపీఎస్ (నూతన పెన్షన్ విధానం)ను తరిమి కొడుతామని అన్నారు.ముఖ్యంగా 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు,ఉద్యోగులకు కోసం నూతనంగా అమలు చేస్తున్న సీపీఎస్(నూతన పెన్షన్ విధానం)ను వెంటనే రద్దు చేసి ఓపీఎస్ (పాత పెన్షన్ విధానం)ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేసే వరకు ఉద్యోగ,ఉపాధ్యాయుల పోరాటం అస్సలు ఆగదని అన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయుల సంకల్పాన్ని తెలియజేసేందుకే మహా ధర్నా కార్యక్రమానికి పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర సంఘం శ్రీకారం చుట్టిందని అన్నారు.సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యోగ,ఉపాధ్యాయులు అలుపెరగని పోరాటాలు చేస్తూ, ఉద్యమాలు చేస్తూ సమన్వయంతో ముందుకు సాగుతూ కంకణ బద్ధులై ఉండాలని అన్నారు. పెద్దేముల్ మండలం నుండి మహా ధర్నాకు భారీ ఎత్తునా ఉపాధ్యాయులు కదిలివచ్చారని, వచ్చిన వారందరికీ పీఆర్టీయూ మండల శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఆర్డీయూ పెద్దేముల్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ రెడ్డి,రాష్ట్ర బాధ్యులు గోబ్ర్యా నాయక్,విజయ లక్ష్మీ, జిల్లా బాధ్యులు రవికాంత్ రెడ్డి, ప్రవీణ్, బందెప్ప,శివ కుమార్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి,రమేష్,ఆంజనేయులు, విజయ నర్సింహులు, బాల్ రాజ్,గోపి కృష్ణ, సురేష్, ఫైమిదాబేగం,రాధ, అంబిక, శాంతి,వసంత,భారతి,రాధిక, పుష్పలత,రహమత్,అల్తాఫ్, సల్మా అంజుమ్,మోహన్,తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు




**బంట్వారం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రంలోని పిఎసిఎస్ లో సీఈవోగా విధులు నిర్వహించిన బ్రహ్మంకు సోమవారం పిఎసిఎస్ సిబ్బంది వివిధ పార్టీ నాయకులు రైతులు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమస్యను చెప్పిన వెంటనే స్పందించడం అయిన నిజాయితీకి గుర్తింపు అని అన్నారు, ఇలాంటి అనుభవమున్న అధికారి పదవి విరమణ పొందడం మనకు తీరని లోటు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఎసిఏస్ చైర్మన్ రామచంద్రారెడ్డి,వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్,వివిధ పార్టీ నాయకులు పెద్దలు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు.

## ఉడుత భక్తిని చాటుకున్న నర్మల భాస్కర్ రెడ్డి



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఉడుత భక్తిని చాటుకున్న నర్మల భాస్కర్ రెడ్డి. సిరికొండ మండలం కొండూరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన ఇండ్లు వరద కు గురైన బాధితులకు నా వంతు సహాయం చేయాలన్న మంచి ఉద్దేశంతో తన సొంత డబ్బులతో 50 దుప్పట్లను బాధితులు కప్పుకోవడానికి అందించి తన ఉడుత భక్తిని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో విడిసి కమిటీ గ్రామ యువత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ పార్టీ నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కాంగ్రెస్ పార్టీ నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి. సిరికొండ మండలం కొండూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెల్లెటం నడిపి గంగయ్య భార్య ఇటీవల బండి యాక్సిడెంట్ తో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి సోమవారం ఆయనను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి,రూరల్ యూత్ వైస్ ప్రెసిడెంట్ మోతే నవీన్ రెడ్డి,నరేష్, యూత్ వైస్ ప్రెసిడెంట్ మొట్టల రాము, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేగం సాయన్న,కొండూర్ మాజీ సర్పంచ్ సల్ల రాజారెడ్డి,నర్మల భాస్కర్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్, ప్రవీణ్, గంగారెడ్డి,అవధూత ప్రసాద్, వంచ భాస్కర్ రెడ్డి,ముసిర్, తదితరులు పరామర్శించారు.



# కాంగ్రెస్ తోనే పేదప్రజల సొంతింటి కల నెరవేరింది

- జనగాంలో 19 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ ల పంపిణీ
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కృషితో తాండూరుకు పెద్ద మొత్తంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం
- దశలవారీగా నిరుపేదల కోసం ప్రభుత్వ పథకాల అమలు
- లబ్ధిదారులు నియమ నిబంధనల ప్రకారం ఇండ్లను నిర్మించుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పి.మహిపాల్ రెడ్డి



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి మాట నెలబెట్టుకోవడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పి.మహిపాల్ రెడ్డి అన్నారు.సోమవారం మండల పరిధిలోని జనగాం గ్రామంలో 19 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేసి,ఇండ్ల నిర్మాణానికి అధికారులతో,స్థానిక నాయకులతో కలిసి ముగ్గు వేయించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పి.మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... నిరుపేదల సంక్షేమ కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.ఎన్నికల సమయంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తామని ప్రజలకు మాట ఇచ్చి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కృషితో తాండూరు నియోజవర్గానికి అధిక మొత్తంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,200 యూనిట్ల ఉచిత కరెంట్,రూ.500 లకే వంట గ్యాస్, రూ.2 లక్షల రైతు రుణమాఫీ,రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పేదలకు సన్న బియ్యం పంపిణీ వంటి అనేక రకాల పథకాలను దశలవారీగా అమలు చేస్తూ నిరుపేద ప్రజలను ఆదుకొంటుందని అన్నారు.కాంగ్రెస్ అంటేనే పేదల ప్రజల సంక్షేమ కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వమని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు హౌసింగ్ అధికారులు సూచించిన నియమ నిబంధనల ప్రకారమే ఇండ్లను నిర్మించుకోవాలని,అనవసరంగా నిబంధనలకు విరుద్ధంగా ఇండ్లను నిర్మించుకొని ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ రతన్ సింగ్, హౌసింగ్ ఏఈ అబ్దుల్ రహీం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహా రెడ్డి,నాయకులు కోహిర్ రవి శంకర్, విజయ్ పటేల్,ఉప్పరి మల్లేషం,ఎండీ. మైఫూజ్,జనగాం గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు,మక్త నర్సింహులు, శివకుమార్, బోయిని పకీరప్ప,చుక్క గోపాల్,యాదప్ప, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సర్వే. సామన్న పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి వ్యాకాస సోమవారం జూపాడు బంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామ సచివాలయంలో గత ఐదు సంవత్సరాలుగా సర్వే సామన్న విధులు నిర్వహిస్తున్నారు రైతులు పేదలు తమ భూములు సర్వే చేసుకోవాలని చలానా కట్టినప్పటికీ పేదలను రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకొని అక్రమ డబ్బుకు ఆశించి ఆ విధంగా ఇచ్చిన వారికి సర్వే చేసి సర్వే రిపోర్టు ఇస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.కర్ణ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాధితులతో కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తంగడంచ గ్రామానికి చెందిన పకీరయ్య కుమారుడు శేషన్నకు పారుమంచాల గ్రామంలో సర్వేర్ నెంబర్ 177లో ఒక ఎకరా రిజిస్టర్ భూమి ఉన్నదని వీటికీ చలానా 19వ తారీకు ఆరోనెల 2025లో తమ భూమి సర్వే చేయడానికిచలానా కట్టినప్పటికీ నెల తరువాత తన భూమి సర్వే చేసి వెళ్ళుతుండగా సర్వే చేసిన రిపోర్టు నాకు ఇవ్వాలా అని రైతు శేషన్న అడిగినప్పటికీ 5000 రూపాయలు ఇస్తేనే సర్వే చేసిన రిపోర్టు ఇస్తాను లేకపోతే ఇవ్వను అని తేల్చి చెప్పగా ఈ విషయం జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకెళ్లి నామని రైతు సేసన్న .కర్ణ తెలిపారు భవిష్యత్తులో రైతులు పేదలు భూ సర్వే కు చలానా కట్టిన వారందరికీ సర్వే చేసిన రిపోర్టు ఇవ్వాలని అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని శాశ్వితంగా ఉద్యోగం నుంచి తొలగించాలని వారు జిల్లా అధికారులకువిన్నవించామని తెలిపారు ఇది ఉదాహరణ మాత్రమే అని ఇలాంటివి ఇంకా చాలా ఉన్నవని అన్నారు.ఈ కార్యక్రమంలో దుబాయ్ భాష తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల వసతి గృహాల్లో నిలిచిన వర్షపు నీరు



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఆదర్శ పాఠశాల వసతి గృహంలో నిలిచిన వర్షపు నీరు సిరికొండ మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు నీళ్లు నిండి విద్యార్థులు నడవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంది. పిల్లలు వసతిగృహాల్లోనికి వెళ్లాలన్న స్కూల్ నుండి బయటకు రావాలన్నా పాములు కప్పలు తేళ్లు విషపురుగులు వస్తున్నాయని ప్రిన్సిపల్ రాజేష్ రెడ్డి తెలిపారు. అధికారులు నీళ్ల నిలువకుండా పరిష్కార మార్గం చూపి విద్యార్థులకు ప్రమాదం జరగకుండా చూడాలని ఆయన అన్నారు. నీటిని తొలగించడానికి శుక్రవారం రోడ్డును తవ్వి పైపులను తాత్కాలికంగా వేయిస్తున్నానని అన్నారు. అధికారులు దీనిపై దృష్టి నిలిపి శాశ్వత పరిష్కారం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సొసైటీ బ్యాంకు లోనే గోల్డ్ లోన్ తీసుకోవాలి

రైతుల సహకారంతోనే సొసైటీ బ్యాంక్ అభివృద్ధి

పిఎసిఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



**బంట్వారం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రైతులు సొసైటీ బ్యాంకులోనే గోల్డ్ లోన్ తీసుకోవాలని పిఎసిఎస్ చైర్మన్ రాంచంద్రరెడ్డి అన్నారు, సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సిఈఓ బ్రహ్మం ఎజెండాను రైతులకు చదివి వినిపించారు.ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ మాట్లాడుతూ..ఇతర బ్యాంకుల కన్నా మన బ్యాంకులో మంచి సౌకర్యాలు ఉన్నాయని రైతులకు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్, డైరెక్టర్లు ఆలంపల్లి లక్ష్మయ్య, శ్రీశైలం, మధు,వెంకట్ రెడ్డి, నరసయ్య, కృష్ణ, సుదర్శన్ రెడ్డి,ఇన్చార్జి సీఈఓ శ్రీనివాస్, సొసైటీ బ్యాంక్ సిబ్బంది,వివిధ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి లంభోదరుడు

వేలం పాటలో ప్రసాదం దక్కించుకున్న భక్తులు



**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం పరిధిలోని రాజారాం తాండ లో శ్రీ సేవ గణేష్ మండలి తరపున వేలం పాట ను ఆదివారం రాత్రి నిర్వహించారు తాండ వాసులు వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ వేలంపాటలో ప్రసాదం లడ్డు ను జాదవ్ రమేష్ 22,100 రూపాయలుకు, అదేవిదంగా చవాన్ కిషన్,రాథోడ్ లక్సమన్,బర్దల్ జైషింగ్,రాథోడ్ పర్సురామ్ లు ఒక్కరు, ఒక్కొక ప్రసాదన్ని దక్కించుకున్నారు.వీరికి గ్రామ ఆలయ పూజారి శ్యామ్ రావ్ మహారాజ్, అలాగే గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ ఖిరు నాయక్, మాజీ ఎంపీటీసీ గంగారాం,గోత్రి సదాశింగ్, జైరాం లు అలాగే తాండ శ్రీసేవ గణేష్ యూత్ మండలి తరపున ప్రసాదాన్ని అందించారు,తాండలో వినాయక మండపం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.సోమవారం నాడు గిరిజన మహిళలు తమ వేసాధారణతో అట పాటలు ఆడుతు గణపయ్య ను గంగమ్మ ఒడికి చేర్చారు.

## గుడేటి రెడ్డి సంఘములో కుంకుమర్చన పూజ



**రాయికల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని ఇటిక్యాల గ్రామంలో వినాయకుని నవరాత్రి ఉత్సవాల భాగంగా సోమవారం రోజున గుడేటి రెడ్డి సంఘంలో మహిళలచే లక్ష్మీ గణపతి పూజ,లక్ష్మీ కుంకుమార్చన పండితులు శివశంకర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం తీర్థ ప్రసాదాలు,అన్నదానం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గుడేటి రెడ్డి అధ్యక్ష కార్యవర్గ సభ్యులు,నాయకులు యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## హామీలు నెరవేరుస్తూ అభివృద్ధి పరుగులు : ఎమ్మెల్యే

- కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం: మండ్రా,గౌరు
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వం రైతులను ఎల్లప్పుడూ రైతును వెన్న అంటూ ఉంటుంది, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని రంగాల హామీలు నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధివైపు పరుగులు పెట్టిస్తున్నారని మాండ్ర, ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోమవారం నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మద్దూరు హరి సర్వోత్తమ్ రెడ్డి కార్యవర్గ సభ్యులు, నాగశేషులు నాయుడు,శ్రీనివాసులు, ప్రమాణస్వీకారం చేశారు.ఈ ప్రమాణస్వీకారనికి ముఖ్య అతిధులుగా నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నందికొట్కూరు టీడీపీ ఇంచార్జి గౌరు వెంకట్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జి మండ్రా శివానందరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే గిత్త మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం సర్వతోముఖా భివృద్ధి సాధిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు ఇప్పటికే అన్ని రంగాలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు అభివృద్ధి పథంలోకి దూసుకువెళుతుంది ఇటువంటి తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందువల్ల వాటిని కూడా అధిగమించేందుకు గ్రామ స్థాయి నుండి కార్యకర్తలు నాయకులు సమయతమై పార్టీకి బలం చేకూర్చాలని వారు కోరారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అప్పుల మయంగా ఉండేదని దీని అంతటిని అధిగమించే మన నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకెళుతుందన్నారు.రాష్ట్రంలో మహిళలు అందరికీ ఉచిత బస్సు ఇంకా ఎన్నో పథకాలు అలాగే లక్ష్మాపురం గురుకుల పాఠశాల మిడుతూర్ మండలం లిఫ్టి ఇరిగేషన్,ఇచ్చినది మన ముక్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో మన నందికొట్కూరు హాస్పిటల్ ను 100 పడకల హాస్పిటల్ గా తీర్చు తీర్చు దిద్దుతాం గ్రామస్థాయి నుండి కార్యకర్తలు నాయకులు పార్టీ పట్ల విధేయత చూపుతు బలం చేకూర్చేఉంది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాట లన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి.టీడీపీ నాయకులు,కార్యకర్తలు, బ్రాహ్మణ కొట్కూరు ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ మందిరంకు తన వంతు సహాయం అందిస్తా

కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి రాథోడ్ వినోద్ కుమార్

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కోహిర్ మండలంలోని పిచేర్యాగడి పాత తండాలో ఆదివారం సాయంత్రం గణేష్ నిమర్జనం సందర్భంగా గణపతి ప్రసాదం పెద్ద లడ్డును రూ.24 వేల రూపాయలకు ఖైవాసం చేసుకొన్నా రామావత్ వకీల్ కుటుంబంకు తాండ పెద్దల సమక్షంలో లడ్డును ఇచ్చి ఘనంగా సత్కారించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి రాథోడ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ..తన సొంత డబ్బులతో 6 నెలలో హనుమాన్ మందిరంలో టైల్స్,రౌండ్ బెడ్డు,రేకుల షెడ్డు,వేయడం జరుగుతుంది అని ఆయన హామీనిచ్చారు. అదేవిదంగా ప్రభుత్వం నుండి ఒక సింగల్ పేస్ బోరు వేపిస్తా అని మాట ఇచ్చారు.ఈ సందర్భంగా తాండ వాసులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# పింఛన్ల కోత ఆరోపణలు నమ్మొద్దు

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లోమాండ్ర, ఎమ్మెల్యే మరియు గౌరు



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి నగదు రూపంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య , మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడటానికే అర్హత లేని పార్టీ విమర్శలు చేయడం దారుణంగా అభివర్ణించారు. చెప్పింది చేస్తున్నామని అన్నారు.దివ్యాంగుల పింఛన్ల కోతపై ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున తీవ్ర ప్రతిపక్షాలు కూటమి ప్రభుత్వంపై ఆరోపణ చేయడం సమంజసం కాదు వాటిని నమ్మొద్దనిన్నారు. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో పెన్షన్లు తెచ్చింది, పెంచింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారుఈకార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి నాయకులు దామోదర్ రెడ్డి,నందికొట్కూరు రూరల్ టి.సుబ్రహ్మణ్యం,పోలీస్ సిబ్బంది, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘోష్ కమిషన్ పక్కా పొలిటికల్ కమిషన్

బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కాళేశ్వరం ప్రాజెక్టు పైన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశాలమేరకు ఈరోజు మోమిన్ పేట్ మండలంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం పైన కుట్ర చేస్తున్నది. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ నదీ జలాలను పక్క రాష్ట్రాలకు తరలించాలని చూస్తున్నారు. ప్రజా సమస్యల పైన కాకుండా కేవలం కాలేశ్వరం పైన చర్చలు జరపడం మరియు సీబీఐకి కాళేశ్వరం అప్పజెప్పడం వంటివి చేసి పూర్తిగా ప్రాజెక్టును మూసి వేయడానికి ప్రయత్నం చేస్తున్నారు.బీజేపీ పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ కలిసి కాళేశ్వరంపైన చేస్తున్న ఈ కుట్రలను ప్రజలు సహించరు. ప్రజలు త్వరలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా గణనాథుని నిమజ్జనం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కాలనీవాసులు
- వేలంపాటలో లడ్డును దక్కించుకున్న భక్తుడు ఉడుత ఆనంద్



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఘనంగా గణనాథుని నిమర్జనం నిర్వహించిన రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు.గత ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడు సోమవారం నిమర్జనికి బయలుదేరారు. ప్రత్యేకంగా మండపాలు, పూజలు జరుగగా కాలనీవాసులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గృహకల్పలో గణనాథుని గత ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడు సోమవారం మధ్యాహ్నం మండపం నుంచి ప్రత్యేక వాహనంలో తరలివెళ్లి నిమర్జనం అయ్యారు. గత ఐదు రోజులుగా గణనాథుని సన్నిధిలో పూజలు అందుకున్న గణనాథుని చేతిలోని స్వామివారి లడ్డును వేలంపాటలో ఉడుత ఆనంద్ కుటుంబ సభ్యులతో కలిసి వేలం పాట పాడి 1,40000లకు లడ్డును దక్కించుకున్నారు.స్వామి వారి నిమర్జనం సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో లడ్డు మా కుటుంబానికి దక్కడం చాలా సంతోషంగా ఉందని ఉడుత ఆనంద్ ఆనందం వ్యక్తం చేశారు. వినాయకుని లడ్డు మా కుటుంబానికి లభించడం వల్ల లడ్డు ప్రసాదాన్ని చుట్టుపక్కల బంధువులకి స్నేహితులకు లడ్డును పంచి ఆనంద భరితులైనారు. లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న వారికి అష్టైశ్వర్యాలు సుఖశాంతులు సమృద్ధిగా కలుగుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు.

## నష్టపోయిన పంటలను ఇండ్లను పరిశీలించిన ఎంపీ



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నష్టపోయిన పంటలను ఇండ్లను పరిశీలించిన ఎంపీ నిజామాబాద్ జిల్లా రూరల్ ధర్పల్లి సిరికొండ మండలలో వరద బాధితులను పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్. సిరికొండ మండలం కొండూరు గ్రామం. ధర్పల్లి మండలం నడిమి తండా వాడి గ్రామాలలో సోమవారం నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ వరద బాధితుల ఇండ్లను ఇసుక పెట్టిన మెట్టలు పంట పొలాలను చూసి చలించి పోయారు.ఆయన బాధితులతో మాట్లాడుతూ..కలెక్టర్ తో మాట్లాడి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసిస్ మెంట్ తొందరగా చేయండి,పంట నష్టపోయిన వారికి 50 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.టైంబొండ్ కార్యక్రమం ద్వారా ఇసుకను ప్రభుత్వమే తీయించాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులచారి,ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్,మండల అధ్యక్షుడు గుర్రం సంజీవ్, జిల్లా నాయకుడు రాజేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ధర్పల్లి బాబురావు, అధికార ప్రతినిధి రంజిత్ బీజేవైఎం యూత్ అధ్యక్షుడు మధు, ఎస్సీ మోర్చా సంద్ర శంకర్, సీనియర్ నాయకుడు తాళ్ల శ్రీనివాస్,కనగందుల గోపి,వావిలాల అజయ్,బచ్చు మారుతి, సూరునిడ గోపి,బుస రాజు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శంకరం కుంట గండి..పంట పొలాల్లో చేరిన వరద



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని గొల్ల కుంట తండా గ్రామపంచాయతీలో గల ఉన్న శంకరం కుంట గండి ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షానికి అల్లాదుర్గం మండలం గొల్ల కుంట తండా గ్రామపంచాయతీ శివారులో గల ఉన్న శంకరం కుంట కట్ట తెగిపోయింది. అటుగా వ్యవసాయ పనులకు వెళ్లిన రైతన్నలు గమనించారు. కుంటకు గండి పడటంతో పొలాల్లో ఇసుక, మట్టి పంటను కప్పేసింది. 10 ఎకరాల వరకు నష్టం వాటిల్లిందని,రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.శంకరం కుంట గండిని మరమ్మతు చేయాలని వరి పంట నష్టం కావడం అధికారులు స్పందించి నష్ట పరిహారం అందించి,ఆదుకోవాలని రైతులు కోరారు.